క్లుప్తంగా

మే నెలలో గొర్రెల పంపిణీ

చందంపేట : మండలంలో 1,128 గొర్రెల యూనిట్లను పంపిణీ చేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి ధనలక్ష్మి ఆదివారం తెలిపారు. మండలంలో అత్యధికంగా కంబాలపల్లి గ్రామానికి 702 యూనిట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మే మొదటి వారంలో గొర్రెల పంపిణీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దవూర : మండల కేంద్రంలోని గిరిజన బాలికల మినీ గురుకులం పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతి నుంచి ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భారతీరెడ్డి ఆదివారం తెలిపారు. ఒకటో తరగతిలో 30, రెండో తరగతిలో 9, మూడో తరగతిలో 2, నాలుగో తరగతిలో 3, ఐదో తరగతిలో ఒక సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి మే 4వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. మే 8న లాటరీ పద్ధతిలో అడ్మిషన్ కమిటీ సమక్షంలో ఎంపిక నిర్వహించున్నట్లు తెలిపారు. బాలికలు ఆరేళ్ల నుంచి పైబడిన గిరిజన బాలికలు అర్హులని తెలిపారు. అడ్మిషన్లు పొందే విద్యార్థులు ఆధార్ కార్డు, తెలుపు రంగు రేషన్ కార్డు, రెండు పాస్‌ఫోటోలు, కుల, ఆదాయ ధృవీకరణ సర్టిఫికేట్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లాల్‌రెడ్డి మృతి బాధాకరం

డిండి : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బొజ్జ లాల్‌రెడ్డి ఇటీవల మృతి చెందడం బాధాకరమని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం బ్రాహ్మణపల్లి గ్రామంలో నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని లాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఆ పార్టీ మండలాధ్యక్షుడు రాజీనేని వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చెర్మన్‌లు తూం నాగార్జున్‌రెడ్డి, శ్రీనివాసరావు, నాయకులు భగవంతరావు, మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌బొజ్జ అలివేలమ్మ పర్వత్‌రెడ్డి తదితరులున్నారు.

బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం



శాంతకుమార్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

వేములపల్లి : మండల కేంద్రానికి చెందిన పుట్టల శాంతకుమార్ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న 1994–95 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన తన తోటి మిత్రులు ఆదివారం రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ స్నేహితుడు శాంతకుమార్ ఆపదలో ఉన్నాడని తెలిసి తమవంతుగా ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. అనంతరం కుటుంబసభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిర్ర రామయ్య, శ్రవణ్‌కుమార్, చింతరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాగేందర్, కోల చంద్రయ్య, విజయ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, జానిపాషా, భాగ్యవతి, ధనమ్మ, సువర్ణ, కరుణ, రజిత, మాధవి, పుల్లారెడ్డి, సైదులు పాల్గొన్నారు.

బత్రాజులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రాజు

నాగార్జునసాగర్ : బత్రాజులకు రాజకీయ పార్టీలు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్ రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సాగర్ హిల్ కాలనీలో జరిగిన బత్రాజుల సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. బత్రాజులు ఎంతో క్రమశిక్షణకు మారుపేరుగా, చైతన్యవంతులుగా ఉన్నా రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నారు. జిల్లా బత్రాజుల సంఘం అధ్యక్షుడు సరకొండ సరసరాజు అధ్యక్షతన జిల్లా యువజన కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కురిపాటి భూపతిరాజు, నాయకులు చక్రహరిరాజు, కూరపాటి రంగారాజు, ఉపాధ్యక్షుడు రామ్మోహన్ రాజు, సరస్వతి రామరాజు , శత్రుఘ్నరాజు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో విజేతలకు ఆదివారం నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, ఓటమితోనే గెలుపునకు నాంది పలుకుతుందన్నారు. క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, శ్రీదేవి, ఆనంద్, బాబా తదితరులు పాల్గొన్నారు.

‘ఎర్లీబర్డ్’కు గడువు ఆరు రోజులే!

- ఈ స్కీమ్ కింద ఆస్తి పన్ను చెల్లిస్తే 5శాతం రాయితీ
- 30వతేదీ వరకు చెల్లింపునకు అవకాశం
- హాలియాలో ఇప్పటి వరకు రూ.35లక్షల వసూలు
- విస్తృతం ప్రచారం చేస్తున్న మున్సిపల్ పాలకవర్గం

హాలియా : ముందస్తు పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోంది. పన్ను చెల్లించే మొత్తం రాయితీని ప్రకటించింది. ఆస్తిపన్ను రాబట్టుకునేందుకు, మున్సిపాలిటీ ఆదాయాన్ని సమకూర్చేందుకు మున్సిపల్ శాఖ ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ పథకంలో భాగంగా ముందస్తు పన్ను చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ కల్పించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన గడువు ఇక 6 రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో హాలియా మున్సిపాలిటీ పట్టణంలో అనేక మంది ఆస్తి పన్ను చెల్లించడానికి ముందుకు వస్తున్నారు. ఈనెల 30 వరకు ఈ పథకం అమలు ఉండడంతో దీని గురించి హాలియా మున్సిపాలిటీ లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. రికార్డుల ప్రకారం హాలియా మున్సిపాలిటీల్లో ఈ ఏడాది రూ.కోటీ 99లక్షలు ఆస్తి పన్ను డిమాండ్ ఉంది. హాలియా మున్సిపాలిటీలో మొత్తం 5,415 అసెస్మెంట్స్ ఉండగా వీటిలో ప్రభుత్వాలకు సంబంధించినవి 16ఉన్నాయి. ఐదు శాతం రాయితీ ఇవ్వడం ద్వారా ఆస్తి పన్ను చెల్లించడానికి పట్టణ ప్రజలు ముందుకు వస్తున్నారు. దీంతో ఈనెల 21వ తేదీ వరకు మున్సిపాలిటీలో ఆస్తి పన్ను చెల్లింపులో సుమారు రూ.35లక్షలపైగా పన్ను వసూల్ అయినట్లు అధికారులు తెలిపారు.



హాలియా మున్సిపాలిటీ కార్యాలయం

ఆదాయ వనరులు కీలకం

మున్సిపాలిటీ నిర్వహణ, పౌరులకు అందించే సేవలు సక్రమంగా కొనసాగాలంటే సొంత ఆదాయ వనరులు కీలకం. ఈ మేరకు పన్నులు, ఇతర ఖాతాల ద్వారా సాధారణ నిధి నిధులు జమ కావాల్సి ఉంటుంది. ఇందులో జమయ్యే నిధుల్లో ప్రధాన వాటా ఆస్తి పన్నులదే, ఏటా ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఏడాది కాలవ్యవధిలో ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

మున్సిపాలిటీలో విస్తృతంగా ప్రచారం..

ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుదారుల కోసం పురపాలక శాఖ ఎర్లీ బర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైంది. ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఆర్థిక సంవత్సరానిగాను ముందస్తు పన్ను చెల్లించే వారికి ఆస్తిపన్నులో ఐదు శాతం రాయితీ ఇస్తుంది. ఈనెల 30లోపు చెల్లించే వారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది. ఈ పథకంపై మున్సిపాలిటీ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను మున్సిపాలిటీల్లో పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం ఎర్లీ బర్డ్ పథకం ప్రవేశ పెట్టింది. ఈ సంవత్సరం ఆస్తి పన్ను ఏప్రిల్ 30వ తేదీలోగా చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ఇవ్వనుంది. ఈ పథకంపై ఇళ్ల యజమానులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. హాలియా మున్సిపాలిటీ బలోపేతం ఆర్థిక వనరులతోనే సాధ్యమవుతోంది. ప్రతి ఒక్కరూ సకాలంలో పన్నులు చెల్లించి అధికారులకు సహకరించాలి.

– కందిమళ్ల వీరారెడ్డి, మున్సిపల్ కమిషనర్, హాలియా

బాధిత రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



తిరుమలగిరి : దగ్ధమైన గడ్డి వాములను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

తిరుమలగిరి (నాగార్జునసాగర్): మండలంలోని జాల్ తండాలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తండాలోని కొంత మంది రైతుల గడ్డివాములు (పశు గ్రాసం) కాలిపోవడంతో సంఘటన స్థలాన్ని ఆదివారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పరిశీలించి సంఘటన జరిగిన పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ అక్కడి నుంచే సంబంధిత అధికారులతో మాట్లాడి నష్టపరిహారాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని సూచించారు. ప్రభుత్వం తరఫున రైతులను ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పశువుల నోటి కాడి గడ్డి ఇలా దగ్ధమైపోవడం చాలా బాధాకరమన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, జెడ్పీటీసీ ఆంగోతు సూర్యబాషా నాయక్, స్థానిక సర్పంచ్ స్వామి నాయక్, నెల్లికలు సర్పంచ్ పమ్మి జనార్ధన్‌రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రమణరాజు, నందికొండ కౌన్సిలర్ ఈర్ల రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ బీలు నాయక్, పాండు, జవహర్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని పిల్లిగుండ్ల తండా సర్పంచ్ సలహాదారులు జటావత్ శంకర్ నాయక్ ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకోవడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ఆయన నివాసానికి వెళ్లి శంకర్ నాయక్ పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలంలోని నెల్లికల్లు గ్రామంలో శ్రీ బాలాజీ ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఎమ్మెల్సీ కోటిరెడ్డి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ భగవాన్ నాయక్, జెడ్పీటీసీ సూర్యబాషా నాయక్, సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ ఈర్ల రామకృష్ణ, బీలు తదితరులు ఉన్నారు.

ప్లీనరీకి కార్యకర్తలు భారీగా తరలి రావాలి



మిర్యాలగూడ టౌన్ : ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు



మిర్యాలగూడ : పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

మిర్యాలగూడ : ఈనెల 25న పట్టణంలోని నందిపాడు వద్దగల శ్రీమన్నారాయణ గార్డెన్స్‌లో నిర్వహించే నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్లీనరీ సమావేశానికి కార్యకర్తలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ స్వరాష్ట్రం సిద్ధించిన తరువాత ఏర్పడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం వల్ల మిర్యాలగూడ పట్టణ రూపురేఖలు మారిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ, డీసీసీబీ డైరెక్టర్ బంటు శ్రీనివాస్, వింజం రాజేంద్రప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు నాగార్జునచారి, శ్రీనివాస్‌గౌడ్, షేక్ మదార్‌బాబా, ఖాజా మోయినొద్దీన్, ఉదయ్‌భాస్కర్, మలగం రమేష్, సాధినేని శ్రీనివాస్‌రావు, నవాబ్, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మాజీద్, వీరారెడ్డి, సైదిరెడ్డి, గోవిందరెడ్డి, వెంకన్న, కిశోర్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి అనేక మంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం దామరచర్ల మండలం కల్లెపల్లి గ్రామానికి చెందిన 75కుటుంబాలు ఇతర పార్టీల నుంచి ధీరావత్ పాచునాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నల్ల మోతు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా కమిటీ సభ్యులు వీరకోటిరెడ్డి, జెడ్పీటీసీ ఆంగోతు లలితాహాతీరాం నాయక్, ఎంపీపీ ధీరావత్ నందిని రవితేజ, ఎంపీటీసీ ధీరావత్ శారదపాచునాయక్, నాయకులు సేవానాయక్, వెంకటేశ్వర్లు, శంకర్‌నాయక్, రమేష్, అశోక్, నాగరాజు, సీతారాములు, వెంకన్న, శంకర్, ఫుల్‌సింగ్, మేష్యా పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

మిర్యాలగూడ టౌన్ : స్థానిక ఎన్‌ఎస్‌పీ క్యాంపులో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములపల్లి మండలానికి చెందిన విమలమ్మ కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసిని ఎమ్మెల్యే భాస్కర్‌రావు అందజేసి మాట్లాడారు. వేములపల్లి మండలం రావులపెంట గ్రామానికి చెందిన యాట విజయలక్ష్మి హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నందున సీఎం సహాయ నిధి కింద ఎల్‌ఓసీ కింద 2లక్షల 50వేల రూపాయల మంజూరు అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రావుల పెంట ఎంపిటిసి, బీఆర్‌ఎస్ నాయకులు నంద్యాల శ్రీరాంరెడ్డి, తలకొప్పుల వెంకటేశ్వర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు చంద్రయ్య, ముక్క శ్రీను తదితరులున్నారు.

దేవరకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తెలిపారు.ఆదివారం దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో రూ.50లక్షలతో మహబూబ్‌నగర్ రోడ్డు నుంచి మిషన్ కంపౌండ్ వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు.పట్టణాల రూపురేఖలను మార్చి ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తుందని ఆయన తెలిపారు. పట్టణ ప్రగతిలో భాగంగా ఆయా వార్డుల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, వైస్ చైర్మన్ రహత్‌అలీ, కౌన్సిలర్ తస్కీన్‌సుల్తానా, ఏఈలు రాజు, శంకర్, వేముల రాజు, పొన్నెబోయిన సైదులు, తౌఫిక్, చిత్రం ప్రదీప్, కృష్ణ పాల్గొన్నారు.

ప్లీనరీని విజయవంతం చేయాలి

దేవరకొండ : దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 25న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ ప్లీనరీని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25న నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో గులాబీ జెండా ఎగురవేయాలని నాయకులు, కార్యకర్తలను ఆయన కోరారు. సమావేశానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు హాజరుకావాలన్నారు. సమావేశంలో పీఏపల్లి ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ మారుపాకుల అరుణసురేష్‌గౌడ్, రమావత్ దస్రూ, రాజీనేని వెంకటేశ్వర్‌రావు, లోకసాని తిరుపతయ్య, ముత్యాల సర్వయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, పున్న వెంకటేశ్వర్లు, వల్లపురెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి,ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలున్నారు.

ఈటల రాజేందర్ క్షమాపణ చెప్పాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మునుగోడు ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రూ. 25కోట్లు తీసుకున్నాడని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కాంసాని చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దేపావత్ శివాజీ నాయక్ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డిపై ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గౌని రాజరమేష్ యాదవ్ పిలుపుమేరకు ఆదివారం మండల కేంద్రంలో రాజేందర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, శివాజీ నాయక్, నాగరాజు, మునినాయక్, అంజి, హనుమంతురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిరుమల్, అనిల్, రాజు, భీమా పాల్గొన్నారు.



ఈటల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుట్రలో భాగంగానే డార్విన్ సిద్ధాంతం తొలగింపు



విద్యార్థులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ముడావత్ రవినాయక్

మిర్యాలగూడ అర్బన్ : ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలో భాగంగానే సీబీఎస్ఈ పదో తరగతి పాఠ్య పుస్తకాల్లో డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ముడావత్ రవినాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ డార్విన్ సిద్ధాంతం తొలగింపుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగాల నుంచి విద్యార్థులను దూరం చేసి మూఢ విశ్వాసాలు పెంచేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శాస్త్రీయ విద్యపై దాడి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ ఉద్యమంలో హిందూ, ముస్లీం ఐక్యతను, గాంధీ హత్యకు సంబంధించిన పాఠాలను తొలగించి దేశంలో మూఢ నమ్మకాలను పెంచి విద్యా కాషాయికరణ చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర పన్నిందని దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. సైన్స్, చరిత్ర లేకపోతే ఈ దేశానికి మనుగడ లేదని తొలగించిన పాఠ్యాంశాలను తక్షణమే చేర్చాలని డిమాండ్ చేశారు. మతోన్మాద, తిరోగమన సిద్ధాంతాల వ్యాప్తిని మైదావులు, ప్రజాస్వామిక వాదులు శాస్త్రజ్ఞులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు కుర్ర సైదానాయక్ తదితరులున్నారు.

పెట్టుబడిదారులకు దోచి పెడుతున్న కేంద్రం



ప్రచారయాత్రలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ : ప్రభుత్వ రంగ సంస్థలను తాకట్టు పెడుతూ దేశ సంపదను పెట్టుబడి దారులకు మోదీ ప్రభుత్వం దోచి పెడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారయాత్ర శనివారం ఆదివారం దేవరకొండ మండల పరిధిలోని పాత్లావత్‌తండా, గుంటిబావితండా, కొమ్మేపల్లి, గొల్లపల్లి, తాటికోల్, రెగ్గలతండా, మంగలోనిబావి, చింతబావి, తెలుగుపల్లి, వైదోనివంపు, కాసారం గ్రామాల మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు రమావత్ అంజయ్యనాయక్, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, వెంకటరమణ, ఎండీ మైనొద్దీన్, తూం బుచ్చిరెడ్డి, కనకాచారి, నూనె రామస్వామి, సుదర్శన్‌రెడ్డి, శైలేష్, కిన్నెర యాదయ్య, వలమల్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

కొండమల్లేపల్లి : గురుకులలో ఐదో తరగతి ప్రవేశానికి గాను నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం కొండమల్లేపల్లిలో ప్రశాంతంగా ముగిసింది. కొండమల్లేపల్లిలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో మొత్తం 482మంది విద్యార్థులకు గాను 452 మంది విద్యార్థులు హాజరు కాగా 30మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి తెలిపారు. అలాగే మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో 384 మందికి గాను 362 మంది హాజరుకాగా 22మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ దయానంద్ తెలిపారు. పరీక్ష కేంద్రం ఆవరణలో విద్యార్థుల సౌకర్యార్థం ఎంపీపీ రేఖశ్రీధర్‌రెడ్డి సహకారంతో టెంట్, తాగునీటి వసతి కల్పించారు.

పుస్తకం.. విజ్ఞానాన్ని అందిస్తుంది

మిర్యాలగూడ టౌన్ : అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని అందించేది పుస్తకమేనని బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథ నాయక్ అన్నారు, ఆదివారం స్థానిక మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రపంచంలో ఉపయోగపడే పుస్తకాలను దృష్టిని సారించాలన్నారు. పోటీ ప్రపంచంలో ఉపయోగపడే పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని, మరిన్ని పుస్తకాలు ఉంటే అందరూ వినియోగించుకోవాలన్నారు. ప్రపంచ విజ్ఞానం పుస్తకాల ద్వారానే వస్తుందనేది మరిచిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి మురళీయాదవ్, లైబ్రరీయన్ కుమ్మరికుంట్ల సుధాకర్, విద్యార్థులు శ్రీనునాయక్, దుర్గయ్య, కిషన్‌చ సుమన్‌రాజు, రమేష్‌చారి, కిరణ్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దశరథనాయక్

ఆధునిక టెక్నాలజీ అందిపుచ్చుకోవాలి

నల్లగొండ టూటౌన్ : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం నలగొండ పట్టణంలోని డ్వాబ్ సురదాస్ భవన్‌లో అంధులకు మొబైల్ వాడకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంధ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాబ్ ప్రధాన కార్యదర్శి చొక్కారావు, అజిత్‌కుమార్, శ్రీహరి, పరమేశ, శ్రీనివాస్, బి. శ్రీనివాస్‌రెడ్డి, స్వామినాయక్, దినేష్‌రెడ్డి పాల్గొన్నారు.

‘మేదర బంధు’ను అమలు చేయాలి



నివేదిక చదువుతున్న నోముల నరేందర్

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణాలో దళిత బంధు మాదిరిగానే మేదర బంధును అమలు చేయాలని తెలంగాణ మేదర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొర్రిగల శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నోముల రవి, నోముల నరేందర్ అన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మేదర సొసైటీకి నాణ్యతతో కూడిన వెదురు అందించాలన్నారు. మేదర సొసైటీలపై ఉన్న పాత బకాయిలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మేదరులకు బ్యాంకుల్లో ఎలాంటి షరతులు లేకుండా రుణాలు అందించాలాన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే అన్ని రకాల రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి గణేష్, ప్రచార కార్యదర్శి రామకృష్ణ, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీను, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, కోశాధికారి ధనలక్ష్మి, అనిత, రాజకీయ చేనేత వేదిక అధ్యక్షులు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ గెలాక్సీ క్లబ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న గెలాక్సీ క్లబ్ సభ్యులు

నల్లగొండ టౌన్ : నల్లగొండ గెలాక్సీ క్లబ్‌కు డబుల్ మిలీనియం అవార్డు దక్కింది. ఆదివారం హైదరాబాదులో ఇంటర్నేషనల్ క్లబ్ డైరెక్టర్లు రుమాండ్ల సునీల్ కుమార్, బాబురావు చేతుల మీదుగా గెలాక్సీ క్లబ్ అధ్యక్షుడు సిరిగిరి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారెడ్డి వెంకట్ రెడ్డి అవార్డు అందుకున్నారు. క్లబ్‌లో అత్యధికంగా 100 మంది సభ్యులు కలిగి ఉన్నందుకు గాను ఈ అవార్డు లభించింది. కార్యక్రమంలో నల్లగొండ క్లబ్ అధ్యక్షుడు గోలి అమరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

డిండి : ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న దాదాపు 8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ.సైదులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని సింగరాజుపల్లి నుండి నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ వైపు మహింద్రా జీటో ప్లస్ వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వాహనాన్ని తనిఖీ చేసి బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హాలియాలో కార్మికుల పాట చిత్రీకరణ

హాలియా : పట్టణంతో పాటు పలు గ్రామాల్లో కార్మికుల పాట చిత్రీకరణను ఆదివారం నిర్వహించారు. ఈ సదర్భంగా ప్రజానాట్య మండలి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, సూర్యాపేట జిల్లా కార్యదర్శి బాదే నరసయ్య మాట్లాడుతూ కార్మికుల చెమట చుక్కలు రాలితేనే కడుపు నిండుద్దన్నారు. దేశం సమాజం వైపు ప్రయాణించాలని, భూములన్ని జాతీయం చేయాలని పెద్ద పెద్ద ఇండస్ట్రీలను ప్రభుత్వమే నిర్వహించాలని, మూసివేసిన ఫ్యాక్టరీలను తెరిపించి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రవి, శ్రీను, సుగుణ, జ్యోతి, సైదమ్మ, మంగమ్మ, కెమెరామెన్ సాయి ఉన్నారు.



పాట చిత్రీకరణలో ఓ సన్నివేశం

ఈదురు గాలులకు తెగిన విద్యుత్ వైర్లు

మిర్యాలగూడ : పట్టణంలో ఆదివారం రాత్రి సమయంలో వీచిన ఈదురుగాలులతో సీతారాంపురంలోని ఉస్మాన్ పుర పాషాబాయ్ ఆర్ఎంపీ క్లినిక్ వద్ద విద్యుత్ వైరు తెగి పడింది. ఒక్కసారిగా గాలి వీయడంతో విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగిలి షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. దీంతో రెండు వైర్లు తెగి నేలపై పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వైరు తెగి కింద పడడం ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండడంతో స్థానికులు గుర్తించి అటుగా వచ్చే వెళ్లే వారిని అప్రమత్తం చేశారు. విద్యుత్ వైర్లు తెగిన విషయం స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ప్రస్తుతం మరమ్మతులు చేస్తున్నారు.



తెగిపడిన విద్యుత్ వైర్లు